కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. టమాటా రూ.21, నల్లవంకాయ రూ.35, పొడుగు వంకాయ రూ.35, బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.45, బజ్జీమిర్చి రూ.40, క్యాప్సికమ్ రూ.70, పచ్చకాకర రూ.55, పందిరి బీర రూ.35, క్యాబేజీ రూ.18, క్యారెట్ రూ.37, దొండ రూ.28, గుండుబీన్స్ రూ.40, గింజ చిక్కుడు రూ.45, గోకరకాయ రూ.40, కీర రూ.13, దోసకాయ రూ.35, బీట్‌రూట్ రూ.21, ఉల్లిగడ్డ రూ.23, ఆలుగడ్డ రూ.21, చామగడ్డ రూ.55, మొరంగడ్డ రూ.28, కందగడ్డ రూ.25, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.9, మునగకాయ రూ.4–6, ముల్లంగి రూ.4–6. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

భజరంగ్ సేన పాదయాత్ర



పాదయాత్ర చేస్తున్న భజరంగ్ సేన కార్యకర్తలు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ టీఆర్‌టీ క్వార్టర్స్‌లో శనివారం భజరంగ్ సేన నాయకులు, కార్యకర్తలు ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. అయోధ్య నుంచి వచ్చిన శ్రీరాముని అక్షింతలు అందించారు. పాదయాత్రలో భజరంగ్‌సేన నాయకులు సతీశ్‌రాజ్, సూర్య శుక్ల, అజయ్‌నాయుడు, జగదీశ్, ప్రసాద్, వేణు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

హోటల్‌లో అసాంఘిక కార్యక్రమాలు

అమీర్‌పేట: ఆన్‌లైన్ యాప్ ద్వారా విటులను ఆకర్శిస్తూ ఓయో హోటల్ కేంద్రంగా అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న వ్యక్తులపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పీవీ రాంప్రసాద్‌రావు తెలిపిన వివరాలు.. అమీర్‌పేటలోని వీవీజీ గ్రాండ్ ఓయో హోటల్ రూమ్ నంబర్ 322లో వ్యభిచారం నడుస్తుందని శుక్రవారం రాత్రి పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు హోటల్‌కు చేరుకొని ప్రసాద్‌రెడ్డి అలియాస్ చేతన్ అలియాస్ మంజునాథతో పాటు అశ్విని ఈ దందా చేస్తున్నట్లు గుర్తించారు. నిర్వాహకులు పారిపోగా నల్లగొండ నివాసి రామగిరి సందీప్, సముద్రాల శంకరయ్యతో పాటు పశ్చిమబెంగాల్‌కు చెందిన యువతిని అరెస్టు చేశారు.

చివరి రోజు క్యూ కట్టిన ప్రజలు



మాణికేశ్వర్‌నగర్‌లో దరఖాస్తులు ఇచ్చేందుకు క్యూ

లాలాపేట: గత నెల 28న ప్రారంభమైన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. చివరి రోజు తార్నాక వార్డు కార్యాలయం కేంద్రంలో 511 అభయహస్తం దరఖాస్తులు, నాగార్జుననగర్ కమ్యూనిటీ హాల్‌లో 250, వినోభానగర్ కమ్యూనిటీ హాల్‌లో 171, మాణికేశ్వర్‌నగర్ ఏడుగుళ్ల కేంద్రంలో 485 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. మొత్తంగా చివరి రోజు 1,417 మంది దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో ఆయా కేంద్రాల అధికారులుగా ఏఎంసీ హేమలత, డీఈఈ పద్మలత, ఏఈ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తులు విక్రయం

అమీర్‌పేట: ఆరు గ్యారంటీ పథకాల దరఖాస్తులు విక్రయిస్తున్న వ్యక్తిపై ఎస్ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శ్రావణ్ తెలిపిన వివరాల ప్రకారం.. సనత్‌నగర్ డివిజన్‌లోని దాసారం బస్తీ కమ్యూనిటీ హాల్లో ప్రజాపాలన శిబిరం కొనసాగింది. అయితే, ప్రజలకు ఉచితంగా ఇవ్వాల్సిన దరఖాస్తులను రూ.50లకు విక్రయిస్తున్నట్లు మహిళలు శిబిరం ఇన్‌చార్జి సందీప్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్థానికుడు పాకాల వెంకటేష్‌గౌడ్ (55) ఈ దరఖాస్తులను విక్రయిస్తున్నట్లు గుర్తించి 420 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి

లాలాపేట: విద్యాశాఖలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని వికలాంగుల సంక్షేమ సంఘం నాయకుడు పంది శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం విద్యాశాఖ, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను ఆయన కార్యాలయంలో కలిసి మాట్లాడారు. ఆయన వెంట జంగిలి శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు ఉన్నారు.



ప్రిన్సిపాల్ సెక్రటరీని కలిసిన నేతలు

దరఖాస్తు స్వీకరణ ముగింపు

సనత్‌నగర్: ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం శనివారంతో ముగిసింది. బేగంపేట సర్కిల్ పరిధిలో 16 కేంద్రాల నుంచి మొత్తం 40,680 అభయహస్తం దరఖాస్తులు రాగా, రేషన్‌కార్డు కోసం 14,012 అప్లికేషన్లు అందాయి. అత్యధికంగా బన్సీలాల్‌పేట డివిజన్‌లో 13,923 అభయహస్తం దరఖాస్తులు, రేషన్‌కార్డు కోసం 4479 అప్లికేషన్లు అందాయి. రాంగోపాల్‌పేట నుంచి 8,096 అభయహస్తం, రేషన్‌కార్డు కోసం 2,870 దరఖాస్తులు వచ్చాయి. మరోవైపు బేగంపేట నుంచి 10,233 అభయహస్తం కోసం, రేషన్‌కార్డు కోసం 3,397 దరఖాస్తులు అందాయి. మోండా నుంచి 8,428 అభయహస్తం దరఖాస్తులు, రేషన్‌కార్డు కోసం 3,266 అప్లికేషన్లు వచ్చాయి.

అన్ని వర్గాలకు సమన్యాయం



దరఖాస్తు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రవీందర్‌గౌడ్

సనత్‌నగర్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారంటీల పథకాలను తమ ప్రభుత్వం అమలు చేసి తీరుతుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్లలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తుందని చెప్పారు. ఆయన వెంట తోట మణిమాల, రాంచందర్, ప్రతాప్ తదితరులున్నారు.

ఈస్ట్ జోన్ డీసీపీకి సన్మానం



బౌద్ధనగర్: ఈస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన బి.సాయిశ్రీ గౌడ్‌ను శనివారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్, ఇతర స్థానిక నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీసీపీకు అభినందనలు తెలిపి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్‌గౌడ్, కౌన్సిల్ సభ్యుడు పోచయ్య యాదవ్, జిల్లా మున్సిపల్ కమిషనర్ నగరపు శ్యామ్ ఉన్నారు.

పాఠశాలలో ఘుమఘుమలు



హైదరాబాదీ బిర్యానీ, మొక్కజొన్న తవా ఫ్రెష్, ఫ్రూట్ సలాడ్, మిల్క్‌షేక్ విత్ డ్రైఫ్రూట్స్, రాగి సంగటి, బిసిబెళ బాత్, పెన్ పొంగల్‌తో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బిహార్, పంజాబ్‌కు చెందిన ఫేమస్ ఫుడ్ ఐటమ్స్ నోరూరించాయి. అయితే, హోటల్‌కు చెందిన మెనూ కాదిది. బాలంరాయి విమాననగర్ మమతా హైస్కూల్‌లో శనివారం జరిగిన న్యూట్రిషన్ ఫెస్ట్‌లో పలు రాష్ట్రాలకు చెందిన ఆహారపదార్థాలను విద్యార్థులు రెడీ చేశారు. అంతేకాదు పోషక పదార్థాల్లో ఉన్న కేలరీలు సైతం వివరించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ఇందిరా దేవి మాట్లాడుతూ.. ఇలాంటి ప్రదర్శనలు విద్యార్థుల్లో మంచి ఆహారపు అలవాట్లను పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. –రసూల్‌పురా





కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

సికింద్రాబాద్: ఇరవై ఏడు మందికి చెందిన కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే టి.పద్మారావుగౌడ్ శనివారం సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత పదేళ్లుగా నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా అందించామన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అర్హులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేశామని చెప్పారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని లక్ష్మీప్రసన్న, రెవెన్యూ అధికారి శివకుమార్, బీఆర్ఎస్ నాయకులు తీగుళ్ల కిరణ్‌గౌడ్, వెంకటేశ్, సతీశ్ వంజర తదితరులున్నారు.

ఇంట్లో ఆభరణాల చోరీ



క్లూస్ టీమ్, క్రైమ్ టీమ్‌తో పరిశీలిస్తున్న అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్

అత్తాపూర్: ఎవరూ లేని సమయంలో ఇంట్లోకి చొరబడిన గుర్తు తెలియని వ్యక్తులు 25 తులాల బంగారు ఆభరణాలను దొంగలించిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి తెలిపిన వివరాల ప్రకారం... కర్ణాటక రాష్ట్రానికి చెందిన అశోక్ బిరాదర్ వ్యాపారం నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి పాండురంగానగర్‌లో నివాసముంటున్నాడు. శుక్రవారం 11 గంటల ప్రాంతంలో అశోక్ బిరాదర్ వ్యాపార పని నిమిత్తం బయటికి వెళ్లగా అతని భార్య రేష్మ అలియాస్ పింకీ దేవాలయానికి వెళ్లారు. శనివారం ఉదయం అవసరం నిమిత్తం కప్‌బోర్డు తెరిచి చూడగా.. అందులోని బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు క్లూస్ టీమ్‌తో దొంగతనం జరిగిన ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలి: ఎమ్మెల్యే లాస్య నందిత



దరఖాస్తు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే నందిత

రాంగోపాల్‌పేట్: అర్హులందరికీ ఆరు గ్యారెంటీ పథకాలను అందించి, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత అన్నారు. శనివారం రెజిమెంటల్ బజార్‌లోని పరికి బస్తీ, డొక్కలమ్మ ఆలయ ప్రాంతాల్లో పర్యటించడంతో పాటు ప్రజాపాలన దరఖాస్తు కేంద్రాలను ఎమ్మెల్యే సందర్శించారు. దరకాస్తులకు చివరి రోజు కావడంతో అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ నాయకురాలు నివేదిత, నాయకులు శేఖర్ ముదిరాజ్, దాసరి కర్ణకుమార్, అజయ్, సాయిప్రసాద్, గజ్జల గోపాల్, భవాని ఉన్నారు.

'మంగళంపల్లి' గానం నిత్య నూతనం

చిక్కడపల్లి: మంగళంపల్లి బాలమురళీకృష్ణ గానంలోని మాధుర్యం నిత్యనూతనమై శ్రోతలను రంజిప చేస్తుందని ప్రముఖ గాయకులు కొనియాడారు. శనివారం సాయంత్రం శ్రీ త్యాగరాయగానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో బుక్ రీడింగ్ అండ్ కల్చరల్ సొసైటీ, శ్రీ రాగ సిటీ మ్యూజికల్ ఆర్కెస్ట్రా 25 సంవత్సరాల సందర్భంగా జరిగిన వేడుకల్లో గాయకుడు డీవీవీఎస్ నాయరాయణ సంకలనం చేసిన సంగీత స్వరనిధి బాలమురళి సంపుటిని ప్రముఖ గాయకుడు త్రినాథరావు, విశ్రాంత విద్యాధికారి పల్లా సోమసుందరశర్మ, అన్నమయ్య సంకీర్తనల పరిశోధకుడు నాగరాజులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అణుశాస్త్రవేత్త విశ్వనాథ్ మద్దిపట్లను కళా వాచస్పతి బిరుదుతో, రక్షణ శాఖలో పదవీ విరమణ చేసిన ఆదినారాయణమూర్తిని జీవిత సాఫల్య పురస్కారంతో, గాయని వీఏ లక్ష్మీని గానసుధా రత్న బిరుదుతో. గాయకుడు నేదునూరి శ్యామ కృష్ణను గాన కళా భూషణ బిరుదులతో సంస్థ పక్షాన సత్కరించారు. సంస్థ కార్యదర్శి అలివేలు నివేదిక సమర్పించారు. అనంతరం లక్ష్మీ, శ్యామ కృష్ణ, శ్రీదేవి తదితరులు పాడిన పాటలు సభికులను ఆకట్టుకున్నాయి.

ఫ్లైఓవర్‌పై పల్టీలు కొట్టిన కారు

సనత్‌నగర్: అతివేగంతో దూసుకొచ్చిన కారు బేగంపేట ఫ్లైఓవర్‌పై పల్టీలు కొట్టింది. అయితే, కారులో బెలూన్స్ తెరుచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు.. కుందన్‌బాగ్‌కు చెందిన శ్రీనివాస్ అనే వ్యక్తి శనివారం తెల్లవారుజామున 4 గంటలకు పంజాగుట్టకు బయలుదేరాడు. అతి వేగంగా నడపడంతో కారు అదుపుతప్పి బేగంపేట బ్రిడ్జిపై బోల్తా కొట్టింది. బెలూన్స్ తెరుచుకోవడంతో శ్రీనివాస్‌తో పాటు కారులో ఉన్న శివ, వంశీ ప్రాణాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురైన కారు

కేలెండర్ ఆవిష్కరణ



రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయ నూతన సంవత్సర కేలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ చంద్రశేఖర్, దాత పి.శ్రీనివాసరావు, అభివృద్ధి కమిటీ సభ్యులు వీరలక్ష్మి, ఎస్ఎస్ కుమారి, ప్రభావతి, విజయలక్ష్మి, అన్నపూర్ణ, రాజేశ్వరి పాల్గొన్నారు.

భవనంపై నుంచి జారి పడి మృతి

అమీర్‌పేట: ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడిన వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పీవీ రాంప్రసాద్‌రావు తెలిపిన వివరాలు.. సనత్‌నగర్‌లోని సుభాశ్‌నగర్‌కు చెందిన సీలం లాజరస్(73)కు మధుమేహం ఉంది. కంటిచూపు మందగించడంతో ఇటీవల క్యాటరాక్ట్ శస్త్ర చికిత్స చేయించారు. శనివారం తన కొడుకు అనిల్‌కుమార్ ప్రజాపాలన శిబిరంలో దరఖాస్తు ఇచ్చేందుకు వెళ్లాడు. ఈక్రమంలో భవనం నాల్గో అంతస్తులో ఉన్న లాజరస్ కాలుజారి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

సందడిగా ముషీరాబాద్ బస్‌డిపోలో వన భోజనాలు



మాట్లాడుతున్న ఈడీ వెంకటేశ్వర్లు

ముషీరాబాద్: కార్మికుల్లో ఐక్యత, స్నేహభావం, ఉత్సాహం నింపడానికి టీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఆదేశాల మేరకు సంస్థ సిబ్బంది అందరికి వన భోజన మహోత్సవ కార్యక్రమం శనివారం ముషీరాబాద్ బస్ డిపో ప్రాంగణంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా గ్రేటర్ హైదరాబాద్ ఈడీ వెంకటేశ్వర్లు, రిజనల్ మేనేజర్ వనప్రసాద్, చార్మినార్ డిప్యూటీ రిజనల్ మేనేజర్ విజయభాను, డిప్యూటీ రిజనల్ మేనేజర్(మెకానికల్) జగన్ తదితరులు హాజరయ్యారు. కార్మికులు కష్టపడి పని చేస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డిపో మేనేజర్ టి.కిషన్‌రావు, అసిస్టెంట్ మేనేజర్ కళ్యాణి, చందర్ తదితరులు పాల్గొన్నారు. డిప్యూటీ ఆర్ఎం విజయభాను, జగన్ తదితర అధికారులు సిబ్బందికి భోజనాలు వడ్డించి వారితో కలిసి భోజనాలు చేశారు. సిబ్బందితో మమేకం కావడానికి వన భోజన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం సిబ్బందికి ఆటల పోటీలు, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఓవర్ లోడ్ వాహనాలపై కొరడా

ట్రాఫిక్ ఏసీపీ సంపత్‌కుమార్



వాహనానికి చలాన్ విధిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ

లాలాపేట: ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా ఓవర్ లోడ్‌తో రోడ్లపైకి వాహనాలు తీసుకొస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఏసీపీ ఎస్.సంపత్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం తార్నాక ప్రాంతంలో వాహనాల రద్దీని పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలపై స్థానిక పోలీసులతో చర్చించారు. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న పలు వాహనాలకు చలాన్లు విధించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఉదయం, సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉంటుందని, ఆ సమయంలో భారీ వాహనాలు రోడ్లపైకి రావడం వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయన్నారు. కాబట్టి వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సిటీలో రోజురోజుకు వాహనాల సంఖ్య పెరుగుతోందని, రద్దీ కారణంగా ట్రాఫిక్ నియంత్రణ కష్టమైందని చెప్పారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు పాటిస్తే సమస్య తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో నల్లకుంట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఎస్సై నిరంజన్, ఏఎస్సై వెంకటేశ్వర్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



సభలో మాట్లాడుతున్న సుషాంత్ పాండా

ఐఆర్ఎంఓపీఎస్ జాతీయ అధ్యక్షుడు సుషాంత పాండా

అడ్డగుట్ట: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఇండియన్ రైల్వే మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ జాతీయ అధ్యక్షుడు సుషాంత పాండే కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం లాలాగూడ రైల్వే గ్రౌండ్‌లో ఐఆర్ఎంఓపీఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సుషాంత పాండే మాట్లాడుతూ.. పాత పెన్షన్‌ను పునరుద్ధరించే వరకు పోరాటం చేస్తామన్నారు. కేంద్రం తెచ్చిన నూతన పెన్షన్ విధానం ఉద్యోగుల పాలిట గుదిబండలా మారిందని చెప్పారు. నూతన పెన్షన్ పేరుతో ఉద్యోగుల రిటైర్మెంట్ కాలాన్ని తగ్గించడం సరికాదన్నారు. సమస్యపై దేశ వ్యాప్తంగా సభలు ఏర్పాటు చేసి ఉద్యోగులను చైతన్య పరుస్తామన్నారు. అనంతరం , ఎంప్లాయిస్ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ ఆంధ్రా, మజ్దూర్ యూనియన్ స్టోర్ బ్రాంచ్ సెక్రటరీ ఆర్య నాయక్, ఆల్ ఇండియా ఎస్సీ–ఎస్టీ జోనల్ ప్రెసిడెంట్ ఎఫ్రీం మాట్లాడారు. రైల్వే ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు యూనియన్ల తరుపున మద్దతు ఇస్తామని వారంతా హామీ ఇచ్చారు. ఈ సభలో జాతీయ కన్వీనర్ చుల్‌బుల్ పాండే, జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ సంతోశ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఆల్ఫ్రెడ్ డేనియల్, సంఘ్ వర్క్‌షాప్ సెక్రటరీ అరుణ్ కుమార్, మీడియా సెక్రటరీ భిక్షపతి గౌడ్, నాయకులు శశిధర్, కృష్ణ, తారక్, శ్రీధర్, నర్సింగ్‌రావు, జగదీశ్, నాగరాజు, వినద్, జనార్ధన్, మల్లికార్జున్ తదితరులున్నారు.

కంటోన్మెంట్‌లో 43,026 దరఖాస్తులు

కంటోన్మెంట్: అభయహస్తం పథకాల కోసం నిర్వహించిన ప్రజాపాలనకు కంటోన్మెంట్ నుంచి విశేష స్పందన లభించింది. కంటోన్మెంట్ పరిధిలోని ఎనిమిది వార్డుల నుంచి 43,026 దరఖాస్తులు అందాయి. కంటోన్మెంట్ పరిధిలో వార్డుల వారీగా అందిన దరఖాస్తులు ఇలా ఉన్నాయి. ఒకటో వార్డులో 6,546, రెండో వార్డులో 11,686, మూడో వార్డులో 3,352, నాలుగో వార్డులో 3,126, ఐదో వార్డులో 4,392, ఆరో వార్డులో 3,299, ఏడో వార్డులో 5,744, ఎనిమిదో వార్డులో 4,861 మంది దరఖాస్తు చేసుకున్నారు.

అదనంగా 7,374 దరఖాస్తులు

అభయహస్తం దరఖాస్తులో పేర్కొన్న పథకాలకు తోడు అదనంగా మరో 7,374 మంది దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. రేషన్‌కార్డు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లతో పాటు ఉద్యోగం, ఇతరత్రా సాయం కోసం దరఖాస్తులు వచ్చాయన్నారు.

సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో...

సికింద్రాబాద్: సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో 20 కేంద్రాల్లో మొత్తం 61,870 దరఖాస్తులు వచ్చాయని ఉప కమిషనర్ సుధాన్షు తెలిపారు. రేషన్ కార్డులు, ఇతర సమస్యలకు సంబంధించి 2,131 దరఖాస్తులు అందాయన్నారు. అడ్డగుట్ట డివిజన్ నుంచి 13,592, తార్నాక నుంచి 13,355, మెట్టుగూడ నుంచి 6,523, సీతాఫల్‌మండి నుంచి 12,948, బౌద్ధనగర్ 15,452 దరఖాస్తులు అందినట్లు సుధాన్షు తెలిపారు.

రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టాలి

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రభుత్వం ద్వారా రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులకు సూచించారు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా పంటల విధానాన్ని చేపట్టి పండించిన ఉత్పత్తులను రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు విదేశాలకు ఎగుమతి చేసే అవకాశాలను వినియోగించుకోవాలని మంత్రి వారికి సూచించారు. శనివారం తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి, అధ్యక్షులు డి.వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శి జి.కృపాకర్ రెడ్డిలు మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ఆయన నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇటీవల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వ్యవసాయ అధికారుల సంఘం నూతన కార్యవర్గం సభ్యులు పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు క్షేత్రస్థాయిలో అధికారులు రైతులకు ఎల్లవేళల అందుబాటులో ఉంటూ సేవలు చేయాలని సూచించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో రూపొందించిన ప్రణాళికలను, వ్యవసాయ విశ్వవిద్యాలయం సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు జిల్లా స్థాయి వ్యవసాయ విజ్ఞాన కేంద్రాల ద్వారా రైతులను చైతన్య పరచాలని రైతులకు సూచించాలని తెలిపారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ జాయింట్ డైరెక్టర్ వి.చంద్రమోహన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతమ్‌రావు జన్మదిన వేడుకలు



గౌతమ్‌రావును గజమాలతో సత్కరిస్తున్న నేతలు

అంబర్‌పేట్: బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు జన్మదిన వేడుకలు సందడిగా జరిగాయి. శనివారం డీడీ కాలనీలోని ఆయన నివాసంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పూలదండలు, శాలువాలతో సత్కరించి అభిమానాన్ని చాటుకున్నారు. బీజేపీ నాయకులు చుక్క జగన్, గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.